శ్రీరస్తు శుభమస్తు



# సాయి సచ్చరిత్ర

**(శనివారం పారాయణ)**

**ద్విపద పాఠ్యము :**

**రచన :**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech



## మూడవ అధ్యాయము

శ్లో॥ అఖండ మండలాకారం వ్యాప్తంయేన చరాచరం
తత్పదం దర్శితంయేన తస్మైశ్రీ గురవేనమః

## బ్రహ్మజ్ఞానం వెంటనే కావాలి

ధనికుండు ఒక్కండు దర్శించి సాయి
వినయంగ అడిగాడు వింతైన లోభి

**బ్రహ్మజ్ఞానము నాకు వలయును సాయి**
**బ్రహ్మజ్ఞానమునిమ్ము పయనమయ్యెదను**

**'టాంగాను' నిలిపాను తమరికై వేచి**
**చెంగున పోయెదన్ షిర్డి వీడెదను**



బాలునొకని పిల్చి బాబాయు చెప్పె
**'బాలా' కడకు పోయి బదులు తెమ్మిపుడె**

**అయిదు రూపాయలు అవసరంబనుచు**
ఆయనింట్లో లేడు అనిచెప్పెవాడు

ఈ రీతి అయిదారు ఇండ్లకేగినను
తిరిగొచ్చె బాలుడు తేకుండగానె

ఈ తంతు చూచినా ఎరుగనట్లుండి
ఆతడు బాబాను అడిగెతొందరని

బదులిచ్చె శ్రీ సాయి పరమాత్ముడిట్లు
**"ఇది విను మిత్రమా ఎవరిత్తురప్పు"**



**ఇరువది ఐదేసి ఇంపైన 'పదివి'**
**ఆ రూప్యములు దాచి అడిగెదవేమి**

**ఎవరిత్తురయ్య నేనిమ్మన్నగాని**
ఆవిధిన్ డబ్బుండె ఆ జేబులోనె

నోటమాటలు లేకనుడువంగలేక
పాటించి మౌనము పడె కాళ్ళమీద

ప్రేమార్ధ్ర హృదయుడై వేదనదీర
ఈ మాటలను జెప్పె ఈశుండు యిట్లు

**నీకు సర్వస్వంబు నీ నోట్లకట్ట**
**నీకు బ్రహ్మంబది నెగడదెన్నడును**

ఎవరు ధనమ్మును ఈషణత్రయము
ఉవిదయు సంసార ఉచ్చులోబడరొ

ఎవరహంకారము, ఇంద్రియములకు
అవనిలో బానిసల్ అవకనుండెదరొ

గురుబోధపైనుంచ గురిని ఎల్లప్పుడు
ఎరుగుదురొ బ్రహ్మ ఇతరులు కాదు

ఆపైన యోగ్యత ఆ దైవకృపయు
ఇంపుగా నుండాలి ఎరుగబ్రహ్మమును

ఇహమున విముఖత ఇంపుగా గలిగి
దేహవాంఛల వీడితీరాలి మనిషి

3.5

పరముపై ఆసక్తి బడసి జీవించి
నిరతము యోగిగా నియతి జీవితము

గడుపువారికి బ్రహ్మ కలుగునుగాని
బడయ సాధ్యముకాదు వానినన్యముగ

ఇంద్రియ సుఖములు ఎల్ల పరిమితము
ఇంద్రియేతరమౌను ఈ బ్రహ్మ సుఖము

ఎన్నియో జన్మలు ఈ రీతిగడుప
ఎన్నడో పొందెదవీవు బ్రహ్మమును

ఆత్మలో నెలకొన్న ఆ బ్రహ్మనెరుగ
కాత్మసాక్షాత్కారమవక సాధ్యంబె

3.6

కలవయ్య వస్తువుల్ ఘనముగా రెండు
ఇల సుఖమ్మిచ్చేవి ఇందులో ఒకటి

పరమ సుఖంబేదొ పరమాత్మదెలుపు
నిరతంబు మనిషిని నేర్పుగా గాచు

ఇహమున సుఖమునే ఎప్పుడూ తలచి
మోహంబులో జీవిమునుగునెల్లపుడు

దేహమే రథమయ్య దీటైనఆత్మ
అహరహంబద్దాని యజమాని సుమ్మి

హయములింద్రియములు అవితోలబడును
నియతితో బుద్ధియే నిజ యజమాని

3.7

సరిగతోలనివారు సహజంబుగానె
చేరరు గమ్యము చింతలేయగును

చంచల మనసుతో  సాధించలేరు
మంచిగ రథయాత్ర మనిషి గమ్యంబు

ఇంద్రియాలను గెల్చు నెనరొ వారికిని
ఇంద్రపదవియైన ఇంపు కాదయ్య

ఆరుదుర్గుణములన్ అడయించకున్న
నిరుపయోగము జ్ఞాన నిధియైన గాని

అహము చావనివాడు ఆతడెన్నడును
ఊహనైన మనసు నొదిగించలేడు

3.8

**ఆత్మ దర్శనమందనట్టి చోనీకు**
**ఆత్మజ్ఞానంబెట్లు అలవడునీకు**

**తిన్నంత అరుగునా తెలియుము దీని**
**తిన్నగా బ్రతుకును దీర్ఘంగవలెను**

**నాయనా! ఆ ఖజానా నుండి నీకు**
**ఈయంగ గలను నేనెంతైనగాని**

**తీసుకొనుటకీవు తెలియుమోరయ్య**
**వసివోని యోగ్యత బడసి యుండాలి**

**అత్యల్ప శ్రమతోటి అందినదేది**
**అత్యల్ప కాలమే ఆయువుండునది**

3.9

ఈ జ్ఞాన బోధను ఈ రీతి వినగ
అజ్ఞానమే పోయి అయ్యెధన్యుండు

**ఈశావాస్యోపనిషత్ పనిపిల్ల**

ఒనర ఈశావాస్య ఉపనిషత్తంత
పనిపిల్లతో బోధ పరపించెసాయి

ఆకథతెలిపెద అల'దాసగణుడు'
చేకొని ఉపనిషత్ చెప్పగ తాను

తనమాతృభాషలో తగిలెను ఎన్నొ
అనుమానములు వాని అడిగె బాబాను

**ఓ సాయి నామది ఉన్ననందియము**
**నీసాయమునగాక నేనెరుంగుదునె**

3.10

ఆ మాటకాసాయి అనె నవ్వులొలక
ఏమిచింతిల్లకు ఇప్పుడే పొమ్ము

**'విల్లిపార్లే' వాసి విను 'దీక్షితుండు'**
**పిల్లవనిది యుంది బేల ఆ బాల**

**అనుమానములు తీర్చు ఆమె నీకన్ని**
**చను, ఆమె నీకట్లు సాయమ్ముజేయు**

ఆశ్చర్యపడినాడు ఆ దాసుగణుడు
నిశ్చయించెను సాయి నియమించినారు

బసయిచ్చి దీక్షితు పనిపిల్ల చేత
వాసిగా చేయించె పనులన్ని అచట

3.11

ఆ పిల్లకడు బీదదయినదేకాని
ఆపలేనట్టిదౌ ఆనందరూపి

కట్టుబట్టలు కూడ కడుపాతవేను
కట్టి చింకివి ఆమె కాలమ్ము గడుపు

దాసుగణుడపుడు దయతోడతాను
చూసి ఇప్పించెను సొగసైన చీర

ధరియించి ఆ చీర తనుపులకించి
తిరిగింది ఆ బాల దివ్వెటీవోలె

మరునాడు ఆ చీరమక్కువన్ దాచి
చీర చింకిది కట్టె చిన్నారి బాల

3.12

పాట పాడిందామె పనులు చేసింది
ఆటలాడిందామె ఆదిలో వలెనె

ఆమెను చూడగా ఆలోచనొచ్చి
ఈ మాదిరి తలంచి నెరిగెనాదాసు

భౌతికంబగునవి బడసిమేల్గాదు
అతి తక్కువే వాటి ఆయువు జూడ

ఆ క్షణంబానందమందినాగాని
తక్షణంబదిపోవు తధ్యంబు ఇదియె

క్షణికమైనట్టిదేకద సంతసమ్ము
అణగారు ఆపైన ఆనందమంత

3.13

శాశ్వతంబైనది జతలేనిదేది
ఈశ్వరానందమే ఎరుగుటేవాని

పేదరికంబైన పెన్నిధుల్ అయిన
వదలిపోవును గాని బ్రహ్మమే స్థిరము

ఈశ్వరుండొక్కడే ఇలను శాశ్వతము
ఈశునివాసమే ఇలసర్వమగును

సాయినాధుని కృప చక్కగా కలిగి
చేయించె జ్ఞానిని చిత్రమౌరీతి

వేలాది గురులున్న వింతేమికాదు
ఈలాగ బోధించ ఎవరికి కాదు

3.14

## ఇంకొకరి శ్రమ దోచరాదు

ఇంటి కప్పెక్కుచు ఇటు నుంచి అటకు
ఒంటరిగా వెళ్ళిరొకనాడు సాయి

ఒక భక్తురాలికి ఉన్నట్టి జ్వరము
తాకుదిరించెను దయతోడ సాయి

ఆమె ఇంటికిపోయి ఆకప్పునెక్కి
తామటునుంచిటు దాటారు బాబ

అదె సాయి వైద్యము ఆమె బాగయ్యె
కుదిరి మలేరియా కొనియాడె ప్రభును

3.15

కప్పెక్క నిచ్చెనన్ కడు శ్రమ కోర్చి
అప్పుడేతెచ్చిన అబ్బాయి కొసగె

రెండురూపాయలు లెక్కపెట్టుచును
ఉండబట్టగలేక ఒకభక్తుడడిగె

**ఓ దేవ దీనిలో ఉన్నదేముంది**
**వదిలించుకుంటిరి పనిబడి డబ్బు**

సాయి నవ్వుచుబల్కె చక్కగా ఇట్లు
**ఓయి నీవీమాట ఒప్పుగా వినుము**

**పట్టుకొచ్చిందేది వచ్చెడి వేళ**
**పట్టుకెళ్ళేది పయనమౌవేళ**

3.16

ఇతరులకష్టము ఈ తీరుదోచు
నతనికి మేలౌనె అవనినెన్నడును

ఈవలె సుఖమును ఇతరుల కపుడె
నీవలె ఇత్తురు నేర్పుగా తిరిగి

## పాటంకర్ గారి పాట్లు

'పాటంకరుం'డనే భక్తుండు ఒకడు
దీటుగా షిరిడీకి దేవుని చూడ

అరుదెంచి ఆయన నడిగాడు ఇట్లు
సాయి నీ వేతీర్చు సందియాలన్ని

వేద వేదాంగాల వేత్తను నేను
లేదునామదిలోన లేదయ్యశాంతి

3.17

నీవు చమత్కార నిపుణుండవంట
నీవు దయాశీలి నీ సాటిలేరు

తెలియజేయుము నాకు తీర్చు సందియము
నిలుపుము శాంతిని నీమదియందు

చిరునవ్వుతోసాయి చెప్పిరి కడకు
ఎరిగించగలనిదే ఇది సత్యమయ్య

గ్రంధముల్ చదివిన కలిగిన జ్ఞాన
మంథుని చేతిలో అమరు దీపంబె

కలడొక్కవణిజుడు కడు అశాంతుండు
తెలిపెదనాతని దీనమౌగాధ

పడవేసె తన'లద్దె' వణిజునిముందు
ఆడ గుర్రమొకటి అటకేగుతెంచి

3.18

తొమ్మిది 'వుండ'లౌతూపడెన్‌లద్దె
నెమ్మితో కొని దానినింపెను చెంగు

కొనినాడు తనవెంట గుణవంతుడౌచు
నేనేమి చెబుదును నీ కింతకన్న

ఆ చెప్పునది ఏదొ అర్థమేగాక
ఆచోటు వీడెను ఆ వణిజయు

ఆతడు 'కేల్కరు' అనువాని కలియ
ఈ తీరు చెప్పాడు ఎరిగించినాడు

3.19

ఆడుగుర్రంబిచట ఆ దైవకృపయె
విడిచిన లద్దెయె విభునిదె కరుణ

'తొమ్మిది వుండలు' తొమ్మిది భక్తి
ఇమ్ముగా మార్గాలు ఈశుని గొలువ

ఏ మార్గమైనను ఎరిగించుకొనిన
నీ మది నమ్మికి నిలకడుండినను

ఆ సాయి బోధను ఆచరించాలి
ఆసాయి శాంతిని అమరించునీకు

మరునాడు దర్శించి మనసార మొక్క
చిరునవ్వుతో సాయి శిష్యుతో అనిరి

3.20

**సేకరించితివిగా చెప్పిన లద్దె**
**ఇక పోయినవిగదా ఎల్ల భ్రాంతులును**

పాటంకరుడు పడె బాబాపదముల
మాటలు చేతలు మరచెను అతడు

ఇదియంత తానుగా ఎరిగించకుండ
బదులీయ ఈరీతి పరమార్థమిదియె

సర్వమూ నేర్చినా శాంతిలేదంచు
సర్వజ్ఞునని వాడు సాయితో చెప్పె

సాయితో మాటాడ సాధ్యమే కాదు
సాయి ముందర ఆట చనునె ఏరికిని

3.21

## సాయి సర్వజ్ఞుడు సందేహమేల

'ఠాకూరు' అనువాని దయజూసె సాయి
చేకొని శిష్యుగా చెబుదునాగాథ

'బెళగాం'కు పనిమీద వెళ్ళె ఠాకూరు
కలిసెను 'అప్ప'నె కన్నడయోగి

ఒక గ్రంథమును యిచ్చి యోగిజెప్పాడు
**నీకు ఉత్తరదిశన్ నీ పనిమీద**

**పోవంగ కలియును పుణ్యుడౌయోగి**
**నీవు నేర్చెదవయ్య నిండుగా అచట**

3.22

బదిలియై 'జున్నారు' పయనమై యతడు
తాదాటు నొకలోయ తప్పనిసరిగ

ఎనుబోతు నెక్కాడు ఏ దారిలేక
వెనువెంటనే తను వెళ్ళె 'కళ్యాణు'

బదిలియై అచ్చట పనిమీద కలిసె
'చాందొర్కరుం'డనే సాయి భక్తుడిని

షిరిడి సాయిని జూడ చెప్పిన మాట
ధరియించి 'ఠాకూరు' తాజేరె నచట

ఆతని జూచిన సాయి అనెనిట్లు నవ్వి
**హితవు చెప్పిన 'అప్ప' ఎనుబోతుపైన**

3.23

**స్వారీని నేర్పడే చక్కగానీకు**
**ఎరుగ అధ్యాత్మంపు హితబోధ అట్లె**

**ఆచరించకనేర్చి అప్రయోజనము**
**ఈ చదువులవల్లనేమి లాభమ్ము**

సాయి సర్వజ్ఞతన్ స్వయముగా చూసి
చేయెత్తి మొక్కాడు షిరిడి బాబాకు

## మనసాయి చురకలు

'పండరిపుర' న్యాయవాది బాబాను
కొండొక చోదిట్టె కూడి మిత్రులను

ఊదితో తగ్గునా ఉన్న రోగాలు
మందులు మింగక మహిమతో నెపుడు

3.24

ఆపైన కొన్నాళ్ళకా న్యాయవాది
కాపాడమని వచ్చె కడకు షిర్డీకి

భక్తితో మొక్కగా బాబాయె అనిరి
**భక్తుల మాయలు పరమాత్మకెరుక**

**మన ఆత్మకెరుకైనమనసులోమాట**
**ఘనుడైన దేవుడు కనిపెట్టలేడె?**

న్యాయవాదిని చూచి నవ్వుతూ అనగ
ఆయనులికిపడె అదె చెప్పుదెబ్బ

తదుపరి ఆతని దయజూచిసాయి
కుదిరించె జ్ఞానము గురుదేవుడపుడు

3.25

అంతఃకరణ శుద్ధి నరయక నరులు
ఎంతపూజించినా ఏమిలాభమ్ము

బండరాయే గాని పరమేశుడవునె
ఉండక నమ్మిక ఉల్లంబులోన

తూలనాడగ రాదు తోపక ఒరుల
'కాలగతిని' వారి 'కాళ్ళు పట్టాలి'

నింగిపై ఊసిన నీమీదె పడును
సంగతిది తెలియ చక్కని సుఖము

తన్నినా సాయియె ఎన్నినావాడె
ఉన్నదా నాథుడే కన్నారగనుడు

3.26

## పాము గండం – బాబా సాయం

'బాలామిరీకరు' పనిమీద 'చితళి'
తలచెను పోవంగ దారిలో తాను

బాబాను దర్శించ వచ్చె షిర్డీకి
బాబాకు మొక్కగా వాని దీవించి

పాము పడగ వోలె వారిహస్తమును
తాము చూపుచు సాయి దరహాసమొలక

**పొడుగాటి బాబాను పొడగాంచగలవు**
**విడువడీ బాబాయు భీతిల్లవలదు**

3.27

ఇతనికి ఆ మాట ఎరుక కాకున్న
చేతులెత్తుచు మ్రొక్కె చేరంగ నెలవు

శ్యామాయుతోడొచు చనె 'మిరీకరు'తొ
తాము చేరిరి రాత్రి తలదాచుకొనగ

హనుమంతుని గుడిని అలిసి చేరారు
ఆనాటి రేయికి అట పవ్వళించ

బుస విని సర్పమున్ పోల్చి అరిచిన
చేసిరి సాయము స్నేహితుల్ అపుడు

3.28

చంపిరి పామును సాయమ్ము అయిరి
కంపించు 'బాలా'ను కాపాడినారు

శ్యామాయు తోడుండ సాయి దీవెనతొ
పాముగండము తప్పెభక్తునికపుడు

భవితము తెలిసియు భగవంతుడైన
తావచింపగరాదు తనవారి భవిత

అందుచే మనసాయి అటు పరోక్షముగ
అందించు సాయము ఆ భక్తులకును

3.29

## వద్దంటే బాబా వస్తుందా చావు?

'బాపు బుట్టీ' గార్ని వణికించె నొకడు
**బాపు నీకుందయా ప్రాణగండంబు**

**పాముకాటున నీకు ప్రాణాలు పోవు**
ఆ మాటవిని భీతిఆతడే వణికె

అయిననూ నిర్భీతి ఆ సాయికడకు
పోయి కూర్చున్నాడు 'బుట్టీ' నిరాస

'డేంగలే' ఇట్లనె **ధైర్యమ్మువిడకు**
**చెంగట రాదయ్య చేరనిన్ చావు**

3.30

**ఈ సాయి దయయున్న ఏ మృత్యువైన**
**చేసి ధైర్యము నీదు చెంతరాదయ్య**

సంజెవేళలొ 'బుట్టి' చనెబహిర్భూమి
ముంజేత దీపమ్ము ముందుగా పూని

నల్లత్రాచును జూచి 'నర్తించిగుండె'
ఝల్లనపెట్టాడు చావుకేకలను

పనివాడు వినికేక పరుగుతో వచ్చె
పూనె బండను చేత'బుట్టీ'ని కాయ

చల్లగా సర్పము జారుకుందెచటొ
పొల్లయ్యె జోస్యము 'బుట్టీ' యు బ్రతికె

3.31

సాయియే శరణీయ చావురాదయ్య
సాయి చరణమెగా సాయమ్ము మనకు

మృత్యుగండము తప్పు మనసార కొలువ
నిత్యము సాయినే శరణు కోరండి

## ఆజ్ఞలే మంత్రాలు

'శ్యామా'ను రక్షించె సాయినాధుండు
పాముకాటున చావు బారినుండియును

ఒకనాడు శ్యామాను ఒక విషనాగు
తాకింది కాటేసి తనువంత విషమె

3.32

వీడి మిత్రుల బోధ వినలేదు అతడు
అదరుచు సాయిని ఆశ్రయించాడు

చల్లగా మాట్లాడు సాయినాథుండు
కళ్ళెర్ర చేశారు గడ గడా వణక

**ఓ పిరికీ నీకు బుద్ధిచెప్పెదను**
**నీ పాదమెట్టకు నిన్ను శిక్షింతు**

**ఎక్కితే ఇచ్చోట ఏను సహించ**
**టక్కున దిగిపొమ్ము దరిజేరరాదు**

భీతిల్లి వణకుచూ వేడెనా 'శ్యామ'
ఆ తాపమే తగ్గి అనె సాయి ఇట్లు

3.33

**వెరవకు ఓ శ్యామ! వినుచెప్పుమాట**
**అరుగుము ఇంటికి అభయమ్మునిత్తు**

**బయట తిరుగవద్దు పనిచేయవలదు**
**నాయందు మదిలోన నమ్మికనుంచు**

**ఇంటికి పోవచ్చు ఏదైన తినుము**
**వెంటనీకుండుగా వెరపేలనయ్య**

**తాత్యాయు 'దీక్షితు తరలిరి వెనుక'**
**ప్రత్యక్ష దైవపు పల్కులన్ వినుచు**

**కొన్ని గంటలలోనె కోలుకున్నాడు**
తన్ను కాచు గురుకు ధన్యతల్ తెలిపి

3.34

తొలుదొల్త సాయన్న దూషణలన్ని
అల నాగు పైననే అనియంచు కనుడు

మంత్రగాళ్ళకు వోలె మనసాయి గురుకు
తంత్రాల పనిలేదు తావీజులైన

ఆజ్ఞయే మంత్రము అరుపులే చాలు
ఆజ్ఞనామోదించి అంతమౌ చావు

## స్వప్నంలో కూడా సంరక్షకుడు

నిద్రలోనుండియు నినుగాచు సాయి
భద్రమిచ్చును నీకు భయము తీరంగ

3.35

'అమీరు షక్కరున్' ఆ స్వామి గాచె
పాముగండమునుంచి బ్రతికించె సాయి

'షక్కరు' కొన్నాళ్ళుచావిడిన్ గడిపె
ఒక్కనాటినిశిని ఉన్నట్లు ఉండి

**'అమీరు' లేవయ్య అటుచూడవయ్య**
**నీ మీద దూకును నీకు హానీయ**

ఆ కేక నిద్రలో అటు పెట్టిసాయి
మేల్కొలిపారట్లు మిత్రుని గావ

ఉలికిపడి 'అమీరు' ఉన్నట్లు లేచి
పలకరించ సాయి పలకనేలేదు

3.36

కలగని ఈ సాయి కలవరించారు
తలచి నవ్వెను వాడు తనలోనె తాను

తన పక్కలో చూచి తళతళలాడు
ఆ నాగు, 'షక్కరు' అరిచాడు భీతి

పోగైరి నలుగురు వురగమ్ముచూచి
చేగొని కఱ్ఱను చితకబాదారు

నిద్రలోయుండియు 'నిఖిలేశు'డట్లె
భద్రంబుగా కాచె భక్తుని సాయి

సంరక్షకుడుకదా సాయినాధుండు
సంరక్షజేయును స్వప్నమందైన

3.37

## వేషం అవసరం లేదు

**తగదయ్య హరిదాసు! డాంబికం నీకు**
**నగవు తెప్పించెడి నర్తకుండట్లు**

హితవిట్లు చెప్పెను ఇంపుగా సాయి
అతని భక్తుండైన ఆ దాసగణుకు

పెళ్ళికొడుకు వోలె వేషంబుదాల్చి
వెళ్ళేటి హరిదాసు వేషంబుగాంచి

**వేషాలు భక్తియు వైరుధ్యముగద**
**వేషమ్ము ఇప్పుడె వీడుమోదాసు**

**నీ శరీరపు సొంపు నీ ధ్యాసనుండ**
**నాశనంబగు భక్తి నామాట వినుము**

3.38

జ్ఞానోదయంబయ్యె చక్కగా అపుడు
కనులు చెమర సాయి కాళ్ళపై బడెను

ఆనాటినుండియే అతడు ఏనాడు
తనవేషధారణ ధ్యాసపోలేదు

చేతిలో దాల్చును చిరుతలు ధ్వనికి
ఆతని మెడలోన అలరుల దండ

ధోవతి కండువా దుస్తులాతనివి
అవి చాలు నన్నాడు ఆనాటినుంచి

కాళ్ళపై బెట్టెను ఘనవేషమంత
మళ్ళి చూడకవీడె మరునిముషంబె

సాయిగరపు బుద్ధి సాయమౌ అటులె
చేయూత నందించు చెప్పును మంచి

3.39

## సమతలేని జ్ఞానం నిరుపయోగం

అటుజేసి 'విష్ణు సహస్ర నామాలు'
ఎటువంటి లాభము ఇమడదోరయ్య

తన పర భేదమ్ము తలదాల్చువాడు
ఏనాడు హరిగాంచడిదియె సత్యంబు

ఈ జ్ఞానమెరుగక ఎంత చదివిన
అజ్ఞానియౌగదా అనుమానమేల

సాయిభక్తుడొకండు చక్కగా తాను
చేయును విష్ణుని సేవన్ పఠించి

3.40

విష్ణు సహస్రమున్ విధిగ వల్లించు
విష్ణు భక్తుండయ్య విభు సాయి గొల్చు

పరులన్న ద్వేషించు పరులగూడడును
గరపజ్ఞానముసాయి గ్రందమాతనిది

శ్యామకు అందించి అదిదాచమనిరి
విముఖుండు అయ్యును వినెసాయిమాట

అదిచూచి భక్తుండు ఆగ్రహంబంది
నిందించి శ్యామాను నిరసనన్ పలికె

వానిబిల్చెను సాయిపలికిరీ రీతి
**వినుమయ్య ఇది తప్పువీక్షించలేవ**

**పరనింద ఘోరమౌపాతకంబగును**
**పరభక్తులకునైన వలదయ్య ఎపుడు**

3.41

**కంఠతావచ్చునే గ్రంధమ్మునీకు**
**శుంఠలా కొట్లాట సొగసుకాదయ్య**

**అది నాది ఇది నాది అను యోచనెపుడు**
**కుదిరించునాముక్తి గొనుమా విరక్తి**

ఇంతబోధించియు హితము నేర్వకనె
పంతాన అన్నాడు భక్తుండు ఇట్లు

**తనవస్తువిచ్చునా తను ఎప్పుడైన**
**నేనేల ఈవలె నీవె చెప్పుమయ**

వెనువెంటనే శ్యామ బెదరక అనెను
**కొనుమేదియైనను గురునిపై ఆన**

తెల్లబోయినవాని దీవించి సాయి
చల్లగా చెప్పిరి జ్ఞానబోధనము

3.42

## ఉల్లిపాయ ఉదంతం

బాబాను కలియనై పనిబడి తాను
చేబూని ఒకయోగి షిరిడీకి వచ్చె

సకల గ్రంధాలను చదివిన అతడు
సకల శాస్త్రాలను చక్కగా నేర్చె

సందేహములు తీర్చు సజ్జనుల్ లేక
ఆందోళనతొ జేరె ఆ యోగి షిర్డి

అతనొచ్చువేళకు అపరాహ్ణమవగ
తా తినుచున్నారు దైవమౌసాయి

3.43

ఒక్క రొట్టెనుతినన్ ఉల్లినంజుచును
ఆక్కడ సాయిని ఆ యోగి జూచె

ఉల్లితినేవాడు యోగి ఎట్లౌను
ఎల్లరు అందురే ఇది తోచ లేదె?

మనసునుండిన అన్ని మాటలు తెలియు
మనసాయి నవ్వెను మనసార తానె

‘చాందోర్కరు’ని పిల్చి సాయి ఇట్లనిరి
**అందరూ ఉల్లిని అరిగించ లేరు**

ఉలికిపడెనుయంత యోగి అచ్చోట
తెలిసెనేరీతిగా దేవుడా ఇతడు

3.44

మరల వానినిజూచి మనసాయి అనిరి
**తినకూడనిది లేదు తెలియుమోరయ్య**

**తినవలసినదేది తినబడందేది**
**తినువారలెవ్వరు దివ్యమౌమాయ**

తెలుపుచు ఈ రీతి తెరిచిరి నోరు
వెలికితీసిరి ఉల్లి వింతగా సాయి

గడగడా వణుకుచూ కన్నీటితోటి
పడె కాళ్ళపైయోగి పలుమార్లు వేడె

కరుణతో దరిబిల్చి ఘనుడైన సాయి
గరపిరి జ్ఞానమ్ము గైకొనివాని

3.45

యోగులకేగురు ఉన్నతుండనుచు
పొగడెను ఆ యోగి పురిషిర్డి వీడె

## హేమాడ్ పంత్ అనుభవం

సచ్చీలి 'హేమాడు' సాయినాధునిది
సచ్చరిత్రమ్మును చక్కగా వ్రాసె

దాని చదువువారు ధన్యులై సాయి
ఘనజీవితమ్మును కాంచగల్గెదరు

బాబాను వేడిన బలుసంపదిచ్చు
బాబానె శరణన్న వదిలించు బాధ

బాబా పదముబట్ట పాయకనిచ్చు
చేబూని మోక్షము చింతయే లేదు

3.46

పూర్వదుష్కర్మము పోనీదు నరుని
సర్వోత్తముని వేడ సాయమైగాచు

జరిగింది ఒకసారి 'సాఠె' వాడాలో
గురువు పై ఒక చర్చకూడ స్నేహితులు

'హేమాడు' 'భోటే' తొ ఎంతొవాదించి
ఏమాత్రమాగకె ఎదురుపల్కాడు

హారతి సమయమై ఆపిరి చర్చ
చేరి సాయికి మ్రొక్కి చెంతనిల్చారు

**ఓయి భోటే చెప్పు ఉన్నవాస్తవము**
**నీయీ సఖుండేమి నీతొవాదించె**

3.47

చిరునవ్వుతోసాయి చెప్పింది వినుచు
మరుమాట'హేమాడు' మరచిపోయాడు

ఎక్కడోవాడాలొ ఇదియంతజరిగె
ఇక్కడ ఈ సాయికెట్లుతోచింది

సర్వజ్ఞుడీసాయి జరిగింది తెలియు
సర్వంబు అనితోచి చక్కగా మ్రొక్కె

**మూడవ అధ్యాయము**
**శ్రీసాయినాథార్పణమస్తు**
**ఓం నమో భగవతే సాయినాధాయ**

* * *

3.48